నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : ఈనెల 24న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మయూరినగర్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు మయూరినగర్, ఆలయ సముదాయం, ఆర్‌ఎస్ నగర్ రోడ్డు, వృద్ధాశ్రమం, ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2 ప్రాంతాలు. మియాపూర్ ఎక్స్ రోడ్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11 కేవీ శ్రీలా గార్డెన్స్ ఫీడర్‌లో శ్రీలా గార్డెన్స్, ఎస్ఎంఆర్ వినయ్‌నగరం, నడిగడ్డ తండా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్డు ప్రాంతాలు. వికాస్ సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్ ప్రాంతం, రత్నదీప్ వెనుక వైపు, మయూరి నగర్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ మయూరినగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు మయూరినగర్, ఎస్‌బీఐ రోడ్, వృద్ధాశ్రమం ప్రాంతాలు. మియాపూర్ ఎక్స్ రోడ్ సబ్ స్టేషన్ నుంచి 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్, దోవా కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గాజులరామారం ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాజులరామారం ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాలాజీ లేఅవుట్, తత్వా స్కూల్ లేన్, వీఎస్ఆర్ అపార్ట్‌మెంట్, గాజులరామారం మహారాజా గార్డెన్స్ లేన్, 11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉమాదేవినగర్, ఎన్టీఆర్ నగర్, 11కేవీ కైలాష్ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు షిర్డీ హిల్స్, కై లాస్‌హిల్స్, నందిని హిల్స్, తిరుమల హిల్స్, ప్రాగా టూల్స్ కాలనీల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ

చింతల్: 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకుని ఎస్ఎల్‌బీ నగర్‌లోని హనుమాన్ ఆలయం నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వరకు శనివారం సాయంత్రం 5 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు చింతల్ డివిజన్ అధ్యక్షుడు రాజుచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



కుత్బుల్లాపూర్: సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూన మహాలక్ష్మీనగర్‌కు చెందిన జోడు సురేఖ, బాచుపల్లి శ్రీసాయినగర్ చెందిన శాంతాకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన రూ.2.70 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, రవి కిరణ్ పాల్గొన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని డాలర్ మెడోస్‌లో గల శ్రీవిశాలా క్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మురళీ యాదవ్, చింతా మల్లేశ్, కృష్ణా రెడ్డి, బల్వంత్ రెడ్డి, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మహిళా గ్రూపు సభ్యులతో కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

దుండిగల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి డ్వాక్రా గ్రూపు మహిళ 10 మొక్కలు నాటి సంరక్షించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. పెద్ద చెరువు వద్ద ×అమృత్ మిత్ర వాటర్ బాడీ–2₹ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పొదుపు సంఘం సభ్యులు వాటర్ బాడీలను సందర్శించి వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. అనంతరం మహిళా గ్రూపు సభ్యులతో కలిసి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ సీఓ మంజుల, మహిళా రిసోర్స్ పర్సన్స్, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నందనవనం పార్కులో బోర్ ఏర్పాటు



నిజాంపేట్: డాక్టర్స్ కాలనీలోని నందనవనం పార్కులో బోరు, ఇతర వసతులు కల్పించాలని కోరుతూ ఆకుల సతీశ్ నాలుగో డివిజన్ ప్రజలతో కలిసి గత 11న మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ తక్షణమే పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే 17న బోర్ వేసి, ఈనెల మొదటి వారంలో నందనవనం కాలనీ పార్కు బోర్లు ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం బోర్‌వెల్‌కు మోటార్ బిగించి నీటి వసతి కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో స్వాతి, లింగస్వామి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బి.శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్‌రావు, స్వాతి పాల్గొన్నారు.

చెరువు వద్ద మొక్కలు నాటిన సభ్యులు



మొక్కలు నాటుతున్న మహిళా సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 'ఉమెన్స్ ఫర్ టీస్–అమృత్ మిత్ర 2.0. ఆన్ ఇనిషిటివ్ క్యాంపెన్' ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దూలపల్లిలోని లింగయ్య చెరువు సమీపంలో అమృత్ మిత్ర ప్లాంటేషన్ చేపట్టారు. కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపు, మెప్మా, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న ప్రహరీ తొలగింపు



ప్రహరీ కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

సుభాష్‌నగర్: గాజులరామారం సర్కిల్ మహదేవపురంలోని సెవెన్ హిల్స్ టెర్మినల్ కాలనీలో అంతర్గత రోడ్డుకు అడ్డుగా పక్క కాలనీ వాసులు ప్రహరీ నిర్మించారు. దీంతో రాకపోకలకు టెర్మినల్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో కాలనీ ప్రెసిడెంట్ పోట్ల సురేశ్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌తో కలిసి కాలనీవాసులు గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా కాలనీ రోడ్డుకు అడ్డును నిర్మించిన ప్రహరీని జేసీబీతో శుక్రవారం తొలగించారు. దీంతో సెవెన్ హిల్స్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ రావు, ప్రసాద్, రమేశ్, అర్జున్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, వైద్యులు, సిబ్బంది

కుత్బుల్లాపూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామంలోని బస్తీ దవాఖానాలో డాక్టర్ అనుపమా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జన ఆరోగ్య కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖానాలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, యశ్వంత్, సోని, శ్రవణ్, శివ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..!



తులసీనగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆల్విన్‌కాలనీ: తులసీనగర్‌లోని జీవన్‌జ్యోతి స్కూలు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.కొందరు చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి అక్కడే పడేస్తుండగా నెలల తరబడి అలాగే ఉంటోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అసలే వర్షాకాలం సమీపిస్తోందని పరిస్థితులు ఇలాగే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



దుండిగల్: మున్సిపాలిటీలోని శంభీపూర్‌లో గల తన కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ కాలనీల సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే శుభకార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ పలువురు ఆయనకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి



ద్విచక్రవాహనదారుడికి హెల్మెట్ ధరింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు సూచించారు. సుచిత్ర చౌరస్తాలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి ఏఆర్ రోడ్డు సర్వే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో సమకూర్చిన హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ..ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బందుల్లేకుండా వాహనాలు నడపాలని సూచించారు.

నూతన కమిటీ ఏర్పాటుకు సమావేశం నిర్వహించాలి

రంగారెడ్డినగర్: కాలనీ సంక్షేమ సంఘం పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో నూతన కమిటీని ఏర్పాటుకు సమావేశం నిర్వహించాలని రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీ మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న సంఘం గడువు ముగుస్తుందని, ఇప్పటివరకు కాలనీ సమావేశం ఏర్పాటు చేయకుండా ప్రస్తుత అధ్యక్షుడు తాత్సారం చేస్తున్నాడని ఆరోపించారు. 6 నెలలకు ఒకసారి కాలనీకి సంబంధించి లెక్కలు చూపుతామన్న సంక్షేమ సంఘం సభ్యులు ఇప్పటి వరకు చూపకుండా దాట వేస్తున్నారని, ఈ విషయమై కాలనీ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేసినా ఉలుకు పలుకు లేదన్నారు.. త్వరలోనే కాలనీ సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నికకు మార్గం సుగమం చేయాలని కోరారు.